సవరించిన ఓటరు జాబితాను అందజేయాలి

సంబంధిత అధికారులకు కలెక్టర్ గౌతమ్ ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: ఇంటి సర్వేతో ఓటర్ల జాబితాను సవరించి నియోజకవర్గాల వారిగా నివేదికలు సమర్పించాలని ఈఆర్ఓ, ఎఈఆర్ఓలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఈ ఆర్ఓలు,ఎఈఆర్ఓలతో జిల్లా అదనపుకలెక్టరు విజయేందర్‌రెడ్డితో కలిసిఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని కలెక్టర్ తెలిపారు. డెత్ కేసులు, షిఫ్టెడ్ కేసులు ఏమైనా ఉంటే భారతీయ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే ఓటరు పేరు రెండు సార్లు నమోదు అయితే ఓటర్ దగ్గర ఉన్న ఓటర్ ఐడీ కార్డును పరిశీలించి అదనంగా ఉన్న ఐడీ కార్డును తొలగించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సమాచారాన్ని ఇవ్వండి

ప్రభుత్వ భూములకు సంబంధించిన సమాచారాన్ని గూగుల్ ఎర్త్ ద్వారా కేఎంఎల్ మ్యాప్‌లతో తయారీ చేసిన రిపోర్టులను అందజేయాలని తహసీల్దార్లు, సర్వేయర్లను జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ప్రభుత్వ భూములపై అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డితో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ భూములను తప్పనిసరిగా గూగుల్ ఎర్త్ ద్వారా కె ఎంఎల్ మ్యాప్ రిపోర్టులను తయారు చేసి ఆర్డీఓల ఆమోదంతో పంపాలన్నారు. గ్రామాల వారీగా కే ఎంఎల్ మ్యాప్ రిపోర్టులను తయారు చేయాలని కలెక్టరు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, రాజేష్‌కుమార్ , తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

‘పురపాలిక’లకు నిధులివ్వడంలో ప్రభుత్వం విఫలం

నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



కీసర: పురపాలక సంస్థలకు నిధులను మంజూరు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అవుతోందని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపాలిటీలకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదని ఆరోపించారు. మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేయకపోతే మున్సిపల్ పరిధిలో ఏవిధంగా అభివృద్ధి పనులు చేపట్టాలి, ఏవిధంగా ప్రజాసమస్యలను పరిష్కరించ గలుగుతామన్నారు. మున్సిపల్ కమిషనర్ జీతంతోపాటు, ఇతర సిబ్బంది జీతాలు, పారిశుద్ధ్య కార్మికుల జీతాల కోసం మున్సిపాలిటీలో వసూలు అయ్యే ఇంటిపన్నుల ఆదాయంపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ప్రతి నెల నాగారం మున్సిపాలిటీలో సిబ్బంది జీతాలు, పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, చెత్త తరలింపు ఆటోల డీజిల్, తదితర ఖర్చుల కోసం సుమారు రూ. 60 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తుందన్నారు. ఈ నిధులన్నింటినీ మున్సిపాలిటీయే సొంతంగా సమకూర్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల పరంగా విస్తరిస్తున్న మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు ఏవిధంగా చేపట్టాలన్నారు.

భరతనాట్య ప్రదర్శనలో విద్యార్థినికి ప్రపంచ స్థాయి గుర్తింపు



విద్యార్థిని లహరికను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం



ప్రశంసాపత్రంతో లహరిక

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని భరతనాట్య ప్రదర్శనలో ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించింది. కళాశాలలో ఈసీఈ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని యంకోజు లహరిక ఇటీవల వారణాసి కేంద్రంగా కాశీవిశ్వనాథ దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లహరిక ప్రపంచ స్థాయి నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబర్చి ఆకట్టుకున్నారు. ఈ మేరకు ప్రపంచ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. బుధవారం కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్‌బాబు, కన్వీనర్ శైలజరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ సంగీత

మేడ్చల్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం నిధులకు సంబంధించిన చెక్కును మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లబ్ధిదారుడికి తన నివాసంలో అందజేశారు. గిర్మాపూర్‌కు చెందిన బండి శేఖర్‌గౌడకు నిదులు మంజూరయ్యాయి. బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, రాజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

పట్టణంలోని 23వ వార్డుకు చెందిన చంద్రకళకు సీఎం సహాయనిధి నుంచి రూ. 36 వేలు మంజూరీ కావడంతో చెక్కును మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. కౌన్సిలర్‌లు కొడే మహేష్, మర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో...

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ మూడో వార్డుకు చెందిన అంజనేయులు, అంజయ్య, రాములమ్మకు స్థానిక కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కును బుధవారం అందజేశారు. అనారోగ్యంతో వారు ఆస్పత్రిలో చికిత్స పొందగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 47,500, రూ. 24,500లు, మంజూరయ్యాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నర్సింహా (ఫైల్)

శామీర్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... శామీర్‌పేట మండలం లాల్‌గడి మలకోపేట గ్రామంలోని ఓ బావిలో మృతదేహం తేలియాడుతున్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి అదే గ్రామానికి చెందిన నర్సింహ(33)గా నిర్ధారించారు.

చంపి బావిలో పడేశారు: మృతుడి కుటుంబ సభ్యులు

తన తమ్ముడిని గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి చంపి బావిలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతుడి అన్న నగేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిన్న (మంగళవారం) రాత్రి 9 గంటల సమయంలో మృతుడు నర్సింహాకు ఫోన్ చేయగా వస్తున్నా అని చెప్పి ఇంటికి రాలేదని, అంతేకాకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ అవ్వడం పలు అనుమానాలకు తావిస్తుందని అన్న నగేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసే సమయంలో మృతుడి నడుముకు బావిలో ఉన్న మోటారుకు తాడు కట్టి ఉండటం, మరో తాడుతో బావిలో ఉన్న మోటారుకు–బావి గట్టుపై ఉన్న రాయికి కట్టి ఉండటం పలు అనుమానాలకు తావిస్తున్నది. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

- 13 మంది అరెస్ట్
- రూ. 4.37 లక్షల నగదు, 15 సెల్ ఫోన్లు, 4 కార్లు సీజ్

శామీర్‌పేట్: పేకాట స్థావరంపై దాడులు నిర్వహించిన ఎస్వోటీ, శామీర్‌పేట పోలీస్‌లు 13 మందిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూడుచింతలపల్లి మండలం, ఉషార్‌పల్లి గ్రామంలోని డీర్ క్రిక్ ఫామ్‌హౌస్‌లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్, జీడిమెట్ల ప్రాంతానికి చెందిన 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదు రూ. 4.37 లక్షల నగదు, 15 సెల్‌ఫోన్లు, 4 కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనాథ్ తెలిపారు.

కొత్త రేషన్ కార్డులపై ఆశలు!

17 నుంచి జరిగే ప్రజాపాలనలో రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణపై చర్యలు

సర్కారు సన్నద్ధతతో కొత్త కార్డుల మంజూరుపై లబ్ధిదారుల్లో ఆశలు



సాక్షి, సిటీబ్యూరో: కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి పది రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలనలో కార్డుల జారీకి సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆశలు మొదలయ్యాయి. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే 5.23 లక్షల రేషన్ కార్డులు ఉండగా, ఇందులో 17.17 లక్షల మంది సభ్యులు ఉన్నారు.కొత్త సభ్యుల పేర్లను కార్డుల్లో చేర్చడానికి జిల్లాలో 86,885 పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కొన్ని తహసీల్దార్ లాగిన్లలో, మరికొన్ని డీఎస్ఓ లాగిన్లలో ఉన్నాయి. గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలనకు జిల్లా వ్యాప్తంగా పలు పథకాలు వర్తింపజేయాలని 7,24,271 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రేషన్‌కార్డులకు సంబంధించి 3.98 లక్షల దరఖాస్తులు చేసుకున్నారు.

కుటుంబాలు వేరు పడటంతో..

2014లో నిర్వహించిన కుటుంబ సమగ్ర సర్వే ఆధారంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఆహార భద్రత కార్డులు జారీ చేశారు. అయితే వినియోగదారులకు ఎలాంటి కార్డులు ఇవ్వకపోయినా... ఆహార భద్రత కార్డుల ప్రకారం బియ్యం పంపిణీ చేస్తున్నారు. పదేళ్లలో వేలాది కుటుంబాలు పలు కారణాలతో వేరుపడ్డాయి. వీరికి రేషన్ కార్డుల అవసరం ఏర్పడింది. చాలా కుటుంబాల్లోని కొత్త కోడళ్లు, పిల్లల వివరాలు కార్డుల్లో లేవు. వీరి పేర్లనూ కార్డుల్లో నమోదు చేయాల్సి ఉంది.

స్పష్టత రావాల్సిందే...

ప్రజాపాలనలో భాగంగా మొత్తానికి కార్డులు లేనివారికి ఇస్తారా? ప్రస్తుతం ఉన్నవారికి కొత్త కార్డులు జారీ చేస్తారా? కుటుంబ సభ్యుల పేర్లు చేర్చి వారికి కొత్తవి ఇస్తారా అనే విషయం తెలియాల్సి ఉంది. గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డులు ఉన్నవారు మళ్లీ దరఖాస్తు చేయవద్దని అధికారులు సూచించారు. ప్రస్తుతం నూతన రేషన్‌కార్డుల జారీ గురించి ప్రభుత్వం ప్రకటన చేయడంతో కొత్త సందేహాలు మొదలయ్యాయి. అయితే కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలకు అనుగుణంగా కొత్త రేషన్ కార్డులపై నిర్ణయం ఉండగలదంటున్నారు.

ప్రస్తుత రేషన్ కార్డుల వివరాలివీ..

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రేషన్ దుకాణాలు: 619
- ఆహార భద్రత కార్డులు: 5,23,895
- కుటుంబ సభ్యుల (యూనిట్లు) సంఖ్య: 17,17,758
- నెల వారీగా పంపిణీ చేస్తున్న బియ్యం: 10,637.036 మెట్రిక్ టన్నులు

సీఎంఆర్‌సెట్‌లో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ ఎడ్జ్ టెక్నాలజీపై వర్క్‌షాప్ నిర్వహించారు. టెక్నోట్రాన్ కంపెనీ సహకారంతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో టెక్నోట్రాన్ ఎండీ వికాస్‌రెడ్డి పాల్గొని ఎడ్జ్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, రవీంద్రబాబు, నాగరాజునాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌కు నిధులు కేటాయించండి



సీఎం రేవంత్‌రెడ్డితో మేయర్ అజయ్‌యాదవ్ తదితరులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ కలిసి వినతిపత్రం అందజేశారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని, వక్ఫ్‌బోర్డు భూముల సమస్యను, దళిత సామాజిక వర్గానికి చెందిన సర్వేనంబరు 63 సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం త్వరలో అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు అడిషనల్ డిస్ట్రిక్ కోర్టు ప్రారంభం

కుషాయిగూడ: కుషాయిగూడలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టులో నేడు నాల్గో అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు ప్రారంభమవుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ప్రజా సంబధాల అధికారి బాల భాస్కర్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి ముఖ్యఅతిథిగా హాజరై కోర్టును ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

మత సామరస్యాన్ని కాపాడాలి : డీసీపీ



అల్వాల్: వినాయక నిమజ్జనం, ఈద్ మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. హిందువులు, మైనార్టీలు పరస్పర సోదరభావంతో ఉండి మతసామరస్యాన్ని కాపాడాలని సూచించారు. ఇరువర్గాలు ఒకరికొకరు సహాయ సౌకర్యాలు కల్పించుకోవాలని తెలిపారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఏసీపీ రాములు, అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్, డీఐ రాజేందర్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్, లక్ష్మణ్, గోపి, రషీద్‌ఖాన్, ఇసాక్‌ఖాన్, రహమాత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



జవహర్‌నగర్: చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంగా నామకరణం చేయడం హర్షణీయమని జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. బుధవారం అంబేద్కర్‌నగర్‌లోని చైతన్య కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ... పోరాట శీలి చాకలి ఐలమ్మ పేరును మహిళ విశ్వవిద్యాలయానికి ప్రకటించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్లు బల్లి రోజాశ్రీనివాస్, కుతాడి సాయి, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, సతీష్‌గౌడ్, సదానంద్, యాదగిరియాదవ్, వినయ్‌కుమార్, రాజు యాదవ్, శ్రీనివాస్, యాదగిరి, నర్సింహులు, ఎల్లయ్య, బుజ్జి పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌స్వామి

మేడ్చల్‌రూరల్: వైద్య వృత్తిలో ఉన్నవారు, ప్రైవేటు వైద్యశాలలు తప్పనిసరిగా వైద్య చట్టాలు, నిబంధనలను పాటించాలని జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌స్వామి అన్నారు. జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్ల యాజమాన్యాలు, నిర్వాహకులు, గైనకాలజిస్ట్, రేడియాలజిస్టు, పాథాలజిస్టులు, వైద్య సిబ్బందికి ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర వైద్య చట్టాలు, వాటి నిబంధనలపై అవగాహన కల్పించారు. వైద్య చట్టాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా వైద్యాధికారి రఘునాథ్ తెలిపారు. రోగి హక్కులను కాపాడటానికి, నైతిక వైద్య విధానాలను నిర్ధారించేందుకు, ప్రజారోగ్య ప్రమాణాలను నిర్వర్తించేందుకు కృషి చేయాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మల్కాజిగిరి: అభివృద్ధి పనుల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చొరవ చూపాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం సర్దార్ పటేల్‌నగర్‌లో రూ. 16 లక్షలతో జరుగుతున్న ఆర్‌సీసీ పైపులైన్ పనులు, సీసీరోడ్డు ప్యాచ్‌వర్క్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం బాలసరస్వతీనగర్ కాలనీవాసులతో కలిసి డిప్యూటీ కమిషనర్ రాజుతో సమావేశం నిర్వహించారు. నాలా నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న ప్రైవేట్ భూమికి నష్టపరిహారం ఇప్పటికే అందేలా చూశానని, నాలా నిర్మాణంలో జాప్యంపై ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చొరవ చూపి పరిష్కరించాలన్నారు. ఏఈ దీపక్, వీఐ రమేష్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

శ్రీగణనాథం..

ఘనంగా కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు

కీసర మండలంలోని వివిధ గ్రామాలతోపాటు, నాగారం,దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం చీర్యాల గ్రామంలోని 9వ వార్డులో నెలకొల్పిన గణేష్ మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేకపూజల్లో చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం చైర్మన్, మాజీ ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. నాగారం మున్సిపల్ బ్రహ్మయ్య కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేకపూజల్లోమున్సిపల్ కౌన్సిలర్ గూడురుసబితాంజనేయులుగౌడ్ పాల్గొన్నారు. మధుగౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. –కీసర



పీర్జాదిగూడలోని సింగ్ యూత్ అసోసియేషన్ గణనాథుడి వద్ద..



చీర్యాల 9వ వార్డులో లక్ష్మీనర సింహస్వామి ఆలయ చైర్మన్...



ఘట్‌కేసర్ ఈడబ్ల్యూఎస్ కాలనీలో గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

కలెక్టరేట్‌లో వినాయక పూజలు



సాక్షి, సిటీబ్యూరో: కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో వినినాయ నిమజ్జనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎంతో ఆహ్లాదకరంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న సుధాకర్‌చారి

జవహర్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జవహర్‌నగర్ అధ్యక్షుడిగా పిన్నోజు సుధాకర్‌చారి నియమితులయ్యారు. బుధవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో సుధాకర్‌చారికి నియామకపత్రం అందచేశారు. ప్రధాన కార్యదర్శిగా కూటికంటి వెంకటేష్, కోశాధికారిగా బిర్రు ఎల్లస్వామి, ఉపాధ్యక్షులుగా సోమయ్యగౌడ్, జలందర్, పాము భాస్కర్, కార్యదర్శులుగా నర్ర మహేష్, అశోక్, సంతోష్, కాశీం, రవి, సాయి, గౌరవ అధ్యక్షులుగా ఆనందాస్ ప్రకాష్‌లను నియమించారు. కార్పొరేటర్ మేక లలితాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

13న జోనల్ స్థాయి ఖోఖో సెలక్షన్స్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, మేడిపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల జోనల్ స్థాయి ఖోఖో టోర్నీ, సెలక్షన్స్ కొర్రెముల జీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నట్లు జోన్ కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. అండర్ 14, 17 బాల బాలికల జట్ల సెలక్షన్స్‌లో 2011 జనవరి 1 తర్వాత జన్మించినవారు, 17 ఏళ్లలోపు 2008 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు తగు ధ్రువీకరణ పత్రాలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. అదనపు సమాచారం కోసం ఫోన్స్: 92913 03090, 93900 68408లలో సంప్రదించాలని సూచించారు.

ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ఏబీవీపీ ఆందోళన



డీఆర్ఎస్ పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని డీఆర్ఎస్ పాఠశాల ముందు బుధవారం ఏబీవీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాఠశాల కేంద్రంగా మారిందని ఆరోపించారు. వాటికి అడ్డుకట్ట వేయాలని, స్కూల్ యాజమాన్యంపై వెంటనే చర్యలు చేపట్టాలంటూ ఏబీవీపీ నాయకులు, తల్లిదండ్రులు పాఠశాల ముందు బైఠాయించి నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. పేట్ బషీరాబాద్ పోలీసులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన విరమింపజేశారు.

భవిష్యత్ తరాల మనుగడకు మొక్కలు నాటాలి



చర్లపల్లి పారిశ్రామికవాడలో మొక్కలు నాటిన ఐలా చైర్మన్ రోషిరెడ్డి తదితరులు

కుషాయిగూడ: భవిష్యత్ తరాలు సుభిక్షంగా ఉండాలంటే మొక్కలు నాటడం తప్పనిసరని ఐలా చైర్మన్ జక్కా రోషిరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో భాగంగా ‘ఏక్ ఫేడ్ మా కే నామ్’ అనే కార్యక్రమాన్ని ఐలా ఆధ్వర్యంలో బుధవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారంతా వారి తల్లి పేరా ఓ చెట్టును నాటారు. రోషిరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు విధిగా మొక్కలు నాటాలన్నారు. పారిశ్రామికవాడలోని గ్రీనరీ బెల్ట్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని, ప్రతి ఉద్యోగి మొక్క నాటేలా చూడాలన్నారు. ఐలా కమిషనర్ ప్రభాకర్, ప్రతినిధులు వెంకటేశ్వర్‌రెడ్డి, పీఎస్ఎస్ ప్రసాద్, వెంకటరామిరెడ్డి, దినేష్‌రెడ్డి, కృష్ణారావు, సురేంద్రరెడ్డి, కిషోర్‌కుమార్, రమణారావు, విక్రమ్, అంకిత తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లతో సమస్యల పరిష్కారం



ప్రారంభించిన మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: 21వ డివిజన్ పరిధిలోని బాలాజీ హిల్స్ ఫేస్ – 1 బస్టాప్ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌లో వీధిలైట్లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తామన్నారు. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానంలో పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్, నాయకులు ఎలిగొండయ్య, సునీల్, బాలయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.